సాక్షి
కామారెడ్డి


శుక్రవారం : 26 : జనవరి : 2024



పకడ్బందీగా పరీక్షలు..

ఇంటర్ వార్షిక పరీక్షలను పకడ్బందీగా నిర్వహించాలని కలెక్టర్ జితేష్ వి పాటిల్ అధికారులను ఆదేశించారు.

- IIలో ▸



బీటీ రోడ్డుగా మారేదెన్నడో..

ఎల్లారెడ్డి మండలంలోని పలు గ్రామాలకు బీటీ రోడ్లు లేకపోవడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు.

- IIలో ▸

గరిష్టం/కనిష్టం
27.5 /16.0

వాతావరణం

ఉదయం, సాయంత్రం వేళల్లో చలిగాలులు వీస్తాయి. ఆకాశం పాక్షికంగా మేఘావృత మవుతుంది. రాత్రి నిర్మలంగా ఉంటుంది.

న్యూస్‌రీల్

పన్ను వసూళ్లపై దృష్టి సారించాలి



నిజాంసాగర్ : ఇంటి పన్నులతో పాటు కుళాయి పన్నుల వసూళ్లపై ప్రత్యేక దృష్టి సారించాలని జిల్లా పంచాయతీ అధికారి శ్రీనివాస్‌రావు సూచించారు. గురువారం మండల కేంద్రంలోని బంజపల్లి గ్రామ పంచాయతీని ఆయన సందర్శించారు. పంచాయతీ రిజిస్టర్లు, రికార్డులను పరిశీలించారు. పంచాయతీల్లో ఇంటి నిర్మాణాలకు అనుమతులు తప్పనిసరిగా తీసుకోవాలన్నారు. పంచాయతీ కార్యదర్శి గంగారాం తదితరులు ఉన్నారు.

పశువైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలి

లింగంపేట : పశు వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని జిల్లా పశువైద్యాధికారి సింహారావు సూచించారు. మండలంలోని మోతెలో గురువారం నిర్వహించిన పశువైద్య శిబిరాన్ని ఆయన పరిశీలించారు. గ్రామాల్లో పశువులకు కృత్రిమ గర్భధారణ, సాధారణ చికిత్సలు, దూడలకు నట్టల నివారణ చికిత్సలు చేసి మందులు అందజేస్తున్నట్లు తెలిపారు. పశువైద్యాధికారులు రవికుమార్, రవికిరణ్, సర్పంచ్ ఏలేటి రాంరెడ్డి, గోపాలమిత్రలు కృష్ణ, ఎజాజ్, మల్లేష్, రమేష్, బ్రహ్మం, మహిపాల్‌రెడ్డి, శివలాల్, వెంకట్, రవి పాల్గొన్నారు.

నేడు తెరవే కవి సమ్మేళనం


కామారెడ్డిఅర్బన్: తెలంగాణ రచయితల వేదిక ఆధ్వర్యంలో శుక్రవారం కామారెడ్డి కర్షక్ బీఎడ్ కళాశాలలో కవి సమ్మేళనం నిర్వహించనున్నట్లు తెరవే జిల్లా అధ్యక్షుడు గఫూర్ శిక్షక్ ఒక ప్రకటనలో తెలిపారు. గణతంత్ర దినోత్సవం సందర్భంగా సాయంత్రం 5గంటలకు సామాజిక సమస్యలపై సమ్మేళనం ఉంటుందన్నారు. ఆసక్తి గల సాహిత్యాభిమానులు హాజరై విజయవంతం చేయాలని కోరారు.

ఏడాదిన్నరలో బ్రిడ్జి పనులు పూర్తవ్వాలి

సుభాష్‌నగర్: అర్సపల్లి రైల్వే ఓవర్ బ్రిడ్జి నిర్మాణాన్ని ఏడాదిన్నరలో పూర్తి చేసి ప్రయాణికులకు అందుబాటులోకి తేవాలని ఎంపీ అర్వింద్ పేర్కొన్నారు. గురువారం అర్సపల్లి బైపాస్ వద్ద రూ. 137.5 కోట్లతో నిర్మించనున్న ఆర్వోబీ పనులకు అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణతో కలిసి భూమిపూజ చేశారు.

తాగి నడిపితే జైలుకే!

- రోడ్డు ప్రమాదాల నివారణకు పోలీసుల కఠిన చర్యలు
- ముమ్మరంగా డ్రంకన్ డ్రైవ్ తనిఖీలు
- దొరికితే కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలింపు



సాక్షి, కామారెడ్డి : మద్యం తాగి వాహనం నడిపితే వారితో పాటు ఇతరులకు ప్రమాదమే. చాలా సంఘటనల్లో రోడ్డు ప్రమాదాలకు మద్యం తాగి నడపడమే కారణం. మత్తులో జరిగిన ప్రమాదాలకు ఎన్నో కుటుంబాలు రోడ్డున పడ్డాయి. ప్రమాదాల నివారణకు పోలీసు శాఖ ఎన్ని చర్యలు తీసుకుంటున్నా తగ్గడం లేదు. ఈ నేపథ్యంలో గత కొంత కాలంగా పోలీసులు డ్రంకన్ డ్రైవ్ తనిఖీలు విస్తృతంగా నిర్వహిస్తూ మత్తు ఉన్నట్టు తేలితే కేసులు నమోదు చేస్తున్నారు. కోర్టుకు పంపిస్తున్నారు. కొన్ని సందర్భాల్లో జరిమానాలతో సరిపెట్టినా, ఈ మధ్యన మద్యం తాగి వాహనం నడుపుతూ చిక్కిన వారికి రెండు రోజులు, మూడు రోజుల జైలు శిక్షలు విధిస్తున్నారు. తాగి వాహనం నడిపితే జైలుకు వెళ్లాల్సిందే అన్నట్టుగా పోలీసులు కేసులు నమోదు చేస్తున్నారు. గత ఏడాది జిల్లాలో డ్రంకన్ డ్రైవ్‌కు సంబంధించి 5,688 కేసులు నమోదయ్యాయి. ఇందులో 1,956 మందికి కోర్టు జరిమానాలు విధించగా, 112 మందికి శిక్షలు పడ్డాయి. ఈ ఏడాది అంటే గడచిన ఇరవై రోజుల్లో డ్రంకన్ డ్రైవ్‌పై పోలీసు యంత్రాంగం మరింత కఠినంగా వ్యవహరిస్తోంది. రోజూ నలుగురైదుగురిని జైలుకు పంపుతున్నారు. జిల్లా కేంద్రం చుట్టుపక్కల రూట్లలో పోలీసులు వాహనాల తనిఖీలు చేపట్టి డ్రంకన్ డ్రైవ్‌లో దొరికిన వారిని వదలడం లేదు. ఎస్పీ సింధుశర్మ డ్రంకన్ డ్రైవ్ విషయంలో కఠినంగా వ్యవహరించాలని పోలీసులను ఆదేశించారు.

నిత్యం తనిఖీలు

డ్రంకన్ డ్రైవ్ విషయంలో పోలీసులు నిత్యం తనిఖీలు నిర్వహిస్తూ దొరికిన వారిని వదలడం లేదు. కేసులు నమోదు చేసి కోర్టుకు హాజరుపరుస్తున్నారు. న్యాయస్థానంలో ద్వితీయ శ్రేణి న్యాయమూర్తి కూడా డ్రంకన్ డ్రైవ్ కేసుల్లో ఒకటి, రెండు రోజుల జైలు శిక్ష విధిస్తున్నారు. దీంతో మద్యం తాగి వాహనాలు నడపాలంటే కొంత భయపడే పరిస్థితి ఉంది. జిల్లా కేంద్రంతో పాటు జిల్లాలోని ఆయా ప్రాంతాల్లో డ్రంకన్ డ్రైవ్ తనిఖీలు నిరంతరం కొనసాగిస్తున్నారు. బ్రీత్ ఎనలైజర్ ద్వారా తనిఖీ చేసి మత్తు లెవల్‌ను పరిశీలించి కేసులు నమోదు చేస్తున్నారు. మరుసటి రోజు కోర్టుకు పంపిస్తున్నారు. ఈ నెల 23న బీబీపేట పోలీస్ స్టేషన్ పరిధిలో మద్యం తాగి వాహనం నడిపిన ఒకరికి మూడు రోజుల జైలు శిక్ష, రూ.మూడు వందల జరిమానా పడింది. భిక్కనూరు పోలీసు స్టేషన్ పరిధిలో ఇద్దరు డ్రంకన్ డ్రైవ్ కేసులో జైలుకు వెళ్లారు. దోమకొండ పోలీసు స్టేషన్ పరిధిలో ఇద్దరికి రెండు రోజుల జైలు శిక్ష, రూ.ఐదు వందల జరిమానా విధించారు. ఎల్లారెడ్డిలో ఈ నెలలో 52 కేసులు నమోదయ్యాయి. వారికి జరిమానాలు విధించారు.


అడ్డదారుల్లో..

పోలీసుల తనిఖీలు పెరగడంతో మందుబాబులు అడ్డదారులు వెతుక్కుంటున్నారు. జిల్లా కేంద్రంతో పాటు అన్ని మండలాల్లోనూ వైన్స్ షాపులకు అనుబంధంగా పర్మిట్ రూంలు కొనసాగుతున్నాయి. చాలా మంది పర్మిట్ రూంలలో కూర్చొని మద్యం తాగుతున్నారు. తాగిన తర్వాత ఇళ్లకు వెళ్లే క్రమంలో పోలీసుల కంట పడకుండా అడ్డదారులను ఎంచుకుంటున్నారు.

మత్తు పదార్థాలను అరికట్టాలి

- కళాశాలల్లో యాంటీ డ్రగ్ కమిటీలు
- కలెక్టర్ జితేష్ వి పాటిల్

కామారెడ్డి క్రైం : మత్తు పదార్థాలను అరికట్టడం ప్రతి ఒక్కరి బాధ్యతని కలెక్టర్ జితేష్ వి పాటిల్ అన్నారు. తేలికగా డబ్బులు సంపాదించాలని చాలా మంది యువకులు మత్తు పదార్థాలను రవాణా చేయడంతో పాటు వాటికి బానిసలుగా మారుతున్నారని పేర్కొన్నారు. కళాశాలల్లో యాంటీ డ్రగ్ కమిటీలు ఏర్పాటు చేయటంపై గురువారం కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. జిల్లాలో గంజాయి, మత్తు పదార్థాల అక్రమ రవాణా, వినియోగాన్ని పూర్తిగా అరికట్టడానికి ఆయా శాఖలు కృషి చేయాలన్నారు. గంజాయి సాగు జరగకుండా పటిష్ట చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. కల్లులో ఆల్ప్రాజోలం కలపకుండా కల్లు డిపోలపై నిఘా పెట్టాలన్నారు. ఒక్క గ్రాము ఆల్ప్రాజోలంతో 800 లీటర్ల మత్తు కల్లు తయారు చేయవచ్చని అన్నారు. జిల్లాలోని అన్ని జూనియర్, డిగ్రీ కళాశాలల్లో యాంటీ డ్రగ్ కమిటీలు ఏర్పాటు చేసి విద్యార్థులకు అవగాహన కల్పించాలన్నారు. ఎస్పీ సింధు శర్మ మాట్లాడుతూ.. ఇటీవల జిల్లాలో ఏడుగురు యువకులు గంజాయి ఆయిల్ వాడుతున్నారని గుర్తించి పట్టుకున్నట్లు చెప్పారు. ఈ ఆయిల్ ఆంధ్ర, ఒరిస్సా సరిహద్దు ప్రాంతాల నుంచి ఇక్కడకు వస్తున్నట్లు గుర్తించామన్నారు. మత్తు పదార్థాలు ద్వారా జరిగే అనర్థాలపై యువతకు అవగాహన కల్పిస్తున్నట్లు తెలిపారు. ఎక్సైజ్ సూపరింటెండెంట్ రవీందర్ రాజు మాట్లాడుతూ.. మత్తు పదార్థాల నివారణకు కృషి చేస్తున్నామన్నారు. రెండు రోజుల క్రితం కామారెడ్డి సమీపంలో 800 గ్రాముల గంజాయిని పట్టుకున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో డీఈవో రాజు, ట్రాన్స్‌కో ఎస్ఈ రమేష్ బాబు, డీఏవో భాగ్యలక్ష్మి, వైద్య శాఖ అధికారులు వేణుగోపాల్, పద్మజ, సీడబ్ల్యూసీ చైర్మన్ సత్యనారాయణరెడ్డి, డ్రగ్స్ కంట్రోల్ అడ్మినిస్ట్రేషన్ అధికారి రాజా రెడ్డి, డీఎస్పీ ప్రకాష్, ఎంపీఈ శ్రీనివాస్ రెడ్డి, ఎఫ్ఆర్‌వో రమేష్ వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.



కౌలాస్‌పై గణతంత్ర వేడుకలు

- నేడు కోటపై జెండా ఆవిష్కరించనున్న ఎమ్మెల్యే లక్ష్మీకాంతారావు
- ఖిల్లా పూర్వ వైభవానికి చర్యలు చేపడతామన్న ఎమ్మెల్యే

నిజాంసాగర్ : దశాబ్దాల చరితకు సాక్షి.. కట్టడాల్లో ఉట్టిపడే శిల్పకళా వైభవం.. ఎత్తయిన బురుజులు.. అబ్బుర పరిచే భారీ ఫిరంగులు.. గత వైభవాన్ని చాటే ఎన్నో విశేషాల సమాహారం కౌలాస్ కోట. మూడు రాష్ట్రాల సరిహద్దుల్లో ఉన్న ఈ కోటలోని ఒక ద్వారం కర్ణాటక వైపు, రెండో ద్వారం మహారాష్ట్ర వైపు, మూడో ద్వారం తెలంగాణ వైపు ఉన్నాయి. జుక్కల్ మండలం కౌలాస్‌లో ఉన్న కౌలాస్ కోట గణతంత్ర వేడుకలకు ముస్తాబైంది. శుక్రవారం ఎమ్మెల్యే లక్ష్మీకాంతారావు ఖిల్లాపై తొలిసారి జాతీయ జెండా ఎగురవేయనున్నారు. కోట ప్రాముఖ్యతను చాటి చెప్పడానికి తొలిసారి జాతీయ జెండా ఆవిష్కరించనున్నారు. అంతేగాకుండా కోటకు పూర్వ వైభవం తీసుకు రావడానికి ఆయన చర్యలు చేపట్టారు. పర్యాటక ప్రాంతంగా తీర్చిదిద్దుతామని ఆయన పేర్కొంటున్నారు. గణతంత్ర వేడుకలకు కోటలో ఏర్పాట్లు చేశారు. కోటకు వెళ్లడానికి తాత్కాలిక రోడ్డు, వాగుపై తాత్కాలిక వంతెన ఏర్పాటు చేశారు.

500 ఎకరాల స్థలంలో..

కౌలాస్ కోట 500 ఎకరాల స్థలంలో ఉంది. ప్రపంచంలోనే అత్యంత పొడవు, బరువైన ఫిరంగి ఈ కోటలో ఉంది. దాని పేరు జగదాంబ భవాని తోప్. ఈ ఫిరంగి పొడవు 23 ఫీట్లు, బరువు సుమారు 70 టన్నులు, వెడల్పు 16 ఇంచులు. ఇలాంటి ఫిరంగి ప్రపంచంలో ఎక్కడా లేనట్లు తెలుస్తోంది.



కోటపై నిర్మించిన జెండా గద్దెను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంతారావు

ఖిల్లా చరిత్ర

జుక్కల్ మండలం కౌలాస్ సమీపంలో క్రీ.శ. 1,544లో ఖిల్లాను నిర్మించినట్లు చరిత్ర చెబుతోంది. ఈ ప్రాంతంలో కై లాస్ అనే మహాముని తపస్సు చేసినందున.. ఆయన పేరున కౌలాస్ ఖిల్లా అని పిలుస్తున్నారు. నాలుగో రాష్ట్ర కూట రాజు గోవిందుని కాలంలో ఈ ప్రాంతం గొప్ప సాంస్కృతిక కేంద్రంగా విరాజిల్లినట్లు తెలుస్తోంది. ఈ ఖిల్లా అనేక యుద్ధాలకు సాక్షిగా నిలిచినట్లు ప్రచారంలో ఉంది. 1857లో జరిగిన ప్రథమ స్వాతంత్ర్య సంగ్రామంలో కౌలాస్‌రాజు రాజా దీప్‌సింగ్ పాల్గొన్నారు. తెలంగాణ, మహారాష్ట్ర, కర్ణాటక సరిహద్దుల్లో ఉన్న ఈ కోట పర్యాటకానికి అనువుగా ఉంది.

నిర్భయంగా ఓటు వేద్దాం

కామారెడ్డి క్రైం : రాజ్యాంగం మనకు కల్పించిన గొప్ప ఆయుధం ఓటు హక్కు అని, ప్రతి ఒక్కరు నిర్భయంగా ఓటు వేయాలని కలెక్టర్ జితేష్ వి పాటిల్ అన్నారు. జాతీయ ఓటరు దినోత్సవం సందర్భంగా గురువారం కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఏడాదిలో నాలుగు సార్లు ఓటరుగా నమోదు చేసుకోవడానికి భారత ఎన్నికల కమిషన్ అవకాశం కల్పిస్తుందన్నారు. ఓటు హక్కుపై అవగాహన కల్పించడానికి జనవరి 25న జాతీయ ఓటరు దినోత్సవంగా నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు. అందులో భాగంగా ఈ సారి 'ఓటును మించి ఏమి లేదు.. నేను ఖచ్చితంగా ఓటు వేస్తాను' అనే సందేశంతో ఎన్నికల సంఘం ప్రత్యేక కార్యక్రమాలను నిర్వహిస్తుందని తెలిపారు. అనంతరం నూతనంగా ఓటు హక్కు పొందిన వారికి ఓటరు కార్డులను కలెక్టర్ అందజేశారు. సీనియర్ సిటిజన్‌లు, దివ్యాంగులు, ట్రాన్స్‌జెండర్‌లను సన్మానించారు. ఓటు ప్రాముఖ్యతపై నిర్వహించిన పోటీల్లో విజేతలకు జ్ఞాపికలు అందజేశారు. ఆర్డీవో శ్రీనివాస్‌రెడ్డి, సీపీవో రాజారామ్, డీపీవో శ్రీనివాస్, ఖజానా శాఖాధికారి సాయిబాబా, ఫిషరీస్ ఏడీ వరదారెడ్డి, భూగర్భ జల శాఖ ఏడీ సతీష్ యాదవ్ పాల్గొన్నారు.



ప్రతిజ్ఞ చేస్తున్న కలెక్టర్ జితేష్ వి పాటిల్



ముస్తాబైన కలెక్టరేట్

గణతంత్ర దినోత్సవానికి ముస్తాబు

కామారెడ్డి క్రైం : గణతంత్ర వేడుకలకు కలెక్టరేట్ ముస్తాబైంది. గురువారం ఆయా శాఖల అధికారులు, సిబ్బందితో కలిసి ఏర్పాట్లు చేశారు. శుక్రవారం ఉదయం 9 గంటలకు కలెక్టర్ జితేష్ వి పాటిల్ జాతీయ పతాకాన్ని ఆవిష్కరిస్తారు. అనంతరం ప్రసంగం, ఉత్తమ సేవలందించిన ఉద్యోగులకు ప్రశంసా పత్రాల అందజేత కార్యక్రమాలు ఉంటాయి. కలెక్టరేట్ ఆవరణలో ఏర్పాట్లను కలెక్టర్ పాటిల్ గురువారం పరిశీలించారు.

మిల్లర్ల మాయాజాలం!

- పక్కదారి పట్టిన ధాన్యం.. ఇతర రాష్ట్రాల నుంచి బియ్యం దిగుమతి
- లారీల్లో తరలివస్తున్న బియ్యం

బాన్సువాడ : బాన్సువాడ పట్టణానికి సమీపంలో ఉన్న ఓ రైస్‌మిల్లుకు ఇప్పటి వరకు 12 లారీల బియ్యం ఇతర రాష్ట్రాల నుంచి దిగుమతి అయింది. గత వానాకాలంలో ప్రభుత్వం కేటాయించిన ధాన్యం పక్కదారి పట్టించిన సదరు మిల్లు యాజమాన్యం.. ప్రస్తుతం ప్రభుత్వానికి సీఎంఆర్ అప్పగించాల్సి ఉండటంతో ఇతర రాష్ట్రాల నుంచి లారీలకు లారీల బియ్యం దిగుమతి చేసుకుంటుంది. జిల్లాలో అనేక రైస్‌మిల్లులు ప్రభుత్వం కేటాయించిన ధాన్యాన్ని పక్కదారి పట్టించాయి. అయితే సీఎంఆర్ విషయంలో ప్రభుత్వం సీరియస్‌గా ఉంది. తాజాగా నిజామాబాద్ జిల్లాలోని ఏడు రైస్‌మిల్లుల యజమానులు సీఎంఆర్‌కు బియ్యాన్ని అప్పగించకపోవడంతో అధికారులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. సుమారు రూ.40 కోట్ల ధాన్యం పక్కదారి పట్టినట్లు అధికారులు పేర్కొంటున్నారు.

ప్రభుత్వం మారడంతో..

గత వానాకాలం సీజన్‌లో రైతుల వద్ద ధాన్యం కొనుగోలు చేసిన ప్రభుత్వం కస్టం మిల్లింగ్ కోసం రైస్‌మిల్లులకు అప్పగించింది. దానిని మిల్లర్లు పక్కదారి పట్టించారు. మార్కెట్‌లో రూ.2,800 నుంచి రూ.3,200 వరకు క్వింటాలు చొప్పున అమ్ముకుని సొమ్ము చేసుకున్నారు. అధికారులు సైతం చూసీ చూడనట్లు వ్యవహరించడంతో మిల్లర్ల మాయాజాలం జోరుగా సాగింది. అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం ఈ నెలాఖారులోగా సీఎంఆర్ అప్పగించాలని ఆదేశాలు జారీ చేసింది. దీంతో మిల్లర్లు షాక్‌కు గురయ్యారు. ఖాళీగా ఉన్న రైస్‌మిల్లుల యాజమానులు ఇతర రాష్ట్రాల నుంచి లారీలకు లారీల బియ్యం దిగుమతి చేసుకుని గన్నీ సంచుల్లో నింపి సీఎంఆర్‌కు అప్పగించే పనిలో నిమగ్నమయ్యారు. ఈ విషయం తెలిసినప్పటికీ కొందరు అధికారులు రైస్‌మిల్లర్లకు సహకరిస్తున్నట్లు సమాచారం. ఇప్పటి వరకు సీఎంఆర్‌కు అప్పగించని మిల్లర్లపై అధికారులు ఫిర్యాదు చేయడంతో మిగతా వారు ఇతర జిల్లాలు, రాష్ట్రాల నుంచి బియ్యం దిగుమతి చేసుకుంటున్నారు. నిజామాబాద్ జిల్లాలో అధికారులు తనిఖీలు చేస్తున్నా.. కామారెడ్డి జిల్లాలో పట్టించుకోవడం లేదనే ఆరోపణలు ఉన్నాయి.

కేసులు నమోదైన మిల్లులివే..

వర్ని మండలంలోని ఎంఎస్ఆర్ ఆగ్రో ఇండస్ట్రీస్, రాయల్ ట్రేడింగ్ కంపెనీ, ఎస్ఏఆర్ ట్రేడర్స్, గంగా రైస్‌మిల్లు, నవీపేట్ మండలంలోని యూనుస్ ట్రేడర్స్, నిజామాబాద్ రూరల్ మండలంలోని శ్రీ లక్ష్మీగణపతి నర్సింహా ఆగ్రో ఇండస్ట్రీస్, బోధన్‌లోని దాదా బాయి ఇండస్ట్రీస్‌పై క్రిమినల్ కేసులు నమోదయ్యాయి. అలాగే వర్ని మండలంలోని వసి పారాబాయిల్డ్ రైస్ మిల్, అర్కామ్ ట్రేడర్స్‌పై పోలీసులకు పౌరసరఫరాలశాఖ అధికారులు ఫిర్యాదు చేశారు.

క్లుప్తంగా

ఖర్గేను కలిసిన ఎమ్మెల్యే తోట



నిజాంసాగర్(జుక్క ల్) : హైదరాబాద్‌లో గురువారం నిర్వహించిన కాంగ్రెస్ పార్టీ బూత్ లెవల్ ఏజెంట్ల సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గేను జుక్కల్ ఎమ్మెల్యే తోట లక్ష్మీ కాంతారావు మర్యాదపూర్వకంగా కలిశారు. పార్టీని బలోపేతం చేయడంతోపాటు గడపగడపకు కాంగ్రెస్ ప్రభుత్వ పథకాలను తీసుకెళ్లేందుకు కృషి చేస్తున్నట్లు ఖర్గేకు వివరించామని ఎమ్మెల్యే తెలిపారు.

29న కామారెడ్డి మండల సమావేశం

కామారెడ్డి రూరల్ : కామారెడ్డి మండల సర్వసభ్య సమావేశం ఈ నెల 29న ఉదయం 11 గంటలకు ఎంపీపీ పిప్పిరి ఆంజనేయులు అధ్యక్షతన కామారెడ్డి మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో నిర్వహించనున్నట్లు ఎంపీడీవో శంకర్‌నాయక్ తెలిపారు.

29న విస్తృతస్థాయి సమావేశం

నిజాంసాగర్(జుక్కల్): ఈ నెల 27 నుంచి అసెంబ్లీ నియోజకవర్గాల వారీగా విస్తృత స్థాయి సమావేశాలు నిర్వహించనున్నట్లు బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ప్రకటించారు. ఇందులో భాగంగా 29వ తేదీన జుక్కల్ నియోజకవర్గ విస్తృతస్థాయి సమావేశాన్ని నిర్వహించనున్నారు. మాజీ ఎమ్మెల్యే హన్మంత్‌సిందే ఇందుకు సంబంధించి ఏర్పాట్లు చేస్తున్నారు. సమావేశానికి పలువురు కేంద్ర కమిటీ ప్రతినిధులు ప్రత్యేక ఆహ్వానితులుగా హాజరుకానున్నారు.

టీపీఎస్‌ఎఫ్ ఏర్పాటు

బిచ్కుంద(జుక్కల్) : జీపీ కార్యదర్శులు కొత్తగా (టీపీఎస్‌ఎఫ్) తెలంగాణ పంచాయతీ సెక్రటరీ ఫెడరేషన్ ఏర్పాటు చేసుకున్నట్లు కార్యదర్శుల సంఘం మండల అధ్యక్షుడు కర్క సంజీవ్ తెలిపారు. ఈ ఫెడరేషన్‌లో జూనియర్, ఔట్‌సోర్సింగ్ కార్యదర్శులు ఉన్నారు అందరు సభ్యత్వం తీసుకోవాలని కోరారు. రుసుము చెల్లించి సభ్యత్వం తీసుకొని ఫెడరేషన్ బలోపేతం చేయడానికి అందరు కృషి చేయాలని కోరారు.

పీజీ పరీక్షలు ప్రశాంతం

తెయూ(డిచ్‌పల్లి): తెయూ పరిధిలో కొనసాగుతున్న పీజీ సెమిస్టర్ పరీక్షలు గురువారం రెండోరోజు ప్రశాంతంగా జరిగినట్లు కంట్రోలర్ అరుణ తెలిపారు.

ఉదయం నిర్వహించిన పరీక్షలకు 1709 మందికి గాను 1613 మంది హాజరు కాగా 96 మంది విద్యార్థులు గైర్హాజరైనట్లు పేర్కొన్నారు. పరీక్షా కేంద్రాలను తెయూ ఆడిట్ సెల్ డైరెక్టర్ ప్రొఫెసర్ గంట చంద్రశేఖర్ సందర్శించి పరీక్షల తీరును పరిశీలించారు.

బీటీ రోడ్డుగా మారేదెన్నడో..?

- ఏళ్లుగా మట్టిరోడ్డుతో ఇబ్బందులు
- మాలాన్‌ఖేడ్, వెల్లుట్ల వెంకటాపూర్, అగ్రహారం గ్రామస్తుల అవస్థలు



రాళ్లుతేలి ప్రయాణానికి ఇబ్బందిగా మారిన మాలాన్‌ఖేడ్ రోడ్డు

ఎల్లారెడ్డిరూరల్(ఎల్లారెడ్డి) : రాళ్లు తేలిన రోడ్లతో ప్రయాణానికి ఇబ్బందులుగా మారుతున్నాయని, గుంతలకాలంగా గాయాలపాలవుతున్నామని మాలాన్‌ఖేడ్, వెల్లుట్ల వెంకటాపూర్, అగ్రహారం గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

వివరాల్లోకి వెళ్తే..

ఎల్లారెడ్డి మండలంలోని మాలాన్‌ఖేడ్, వెల్లుట్ల వెంకటాపూర్, వెంకటాపూర్ అగ్రహారం గ్రామాలకు మట్టి రోడ్డు మాత్రమే ఉంది. గ్రామాలకు వెళ్లే దారులు రాళ్లు తేలి ఇబ్బందులు పడుతుండగా వర్షాకాలంలో గుంతలమయంగా మారి జారిపడి వాహనదారులు గాయాలపాలైన సంఘటనలు అనేకం ఉన్నాయి. మాలాన్‌ఖేడ్ గ్రామానికి వెళ్లే దారి కంకర తేలడంతో పాటు కొన్ని చోట్ల వర్షాకాలంలో బురదతో వాహనదారులు అదుపుతప్పి ప్రమాదాల బారిన పడి వారు ఉన్నారు. మండలంలోని మట్టి రోడ్డుగా ఉన్న మాలాన్‌ఖేడ్, వెల్లుట్ల వెంకటాపూర్, వెంకటాపూర్ అగ్రహారం గ్రామాలకు బీటీ రోడ్డుగా మారుస్తూ గత ప్రభుత్వంలో మాజీ మంత్రి కేటీఆర్ నిధుల జీవోను కూడా విడుదల చేశారు. మాజీ మంత్రి హామీ ఇచ్చి ఆర్నెళ్లు గడుస్తున్నా ఇంతవరకు పనులు జరగకపోవడంపై గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇకనైనా అధికారులు స్పందించి గ్రామాలకు బీటీ రోడ్డు పనులు జరిగేలా తగిన చర్యలు తీసుకోవాలని వారు కోరుతున్నారు.

వర్షాకాలం వస్తే భయమే..



వర్షాకాలం వచ్చిందంటే మా గ్రామం నుంచి ఎల్లారెడ్డికి వెళ్లాలంటే భయమేస్తోంది. వర్షాకాలంలో గ్రామానికి చెందిన కొందరు వాహనాలు అదుపు తప్పి గాయాలబారిన పడ్డారు. మరో వర్షాకాలం రాక ముందే అధికారులు గ్రామానికి బీటీ రోడ్డు వేసేలా తగిన చర్యలు తీసుకోవాలి.

– యాదయ్య, మాలాన్‌ఖేడ్

పనులు ప్రారంభం కావట్లేదు..



గత ఆర్నెళ్ల క్రితం ఎల్లారెడ్డికి మాజీమంత్రి కేటీఆర్ వచ్చిన సమయంలో మాలాన్‌ఖేడ్‌తో పాటు పలు గ్రామాలకు బీటీ రోడ్డు ఏర్పాటు చేస్తూ జీవోను మాజీ ఎమ్మెల్యే సురేందర్‌కు అందించారు. కాని ఇంత వరకు పనులు ప్రారంభం కాలేదు.

– సాయిబాబా, మాలాన్‌ఖేడ్

టెండర్లు వేసినా..

ఎల్లారెడ్డి మండలంలోని వెల్లుట్ల వెంకటాపూర్, వెంకటాపూర్ అగ్రహారం, మాలాన్‌ఖేడ్ గ్రామాలతో పాటు సోమర్యాగడితాండాకు సంబంధించి బీటీ రోడ్డు ఏర్పాటు చేయాలని జీవో వచ్చింది. దీంతో టెండర్ల కోసం నోటిఫికేషన్ ఇచ్చినా పనులు చేసేందుకు ఎవరు ముందుకు రాలేదు. టెండర్లలో ఎవరైనా ముందుకు వస్తే పనులు చేపడతాం.

– గిరిధర్, డీఈ, పంచాయతీరాజ్, ఎల్లారెడ్డి

రెండు నెలల్లో రోడ్డు విస్తరణ పనులు



మహమ్మద్‌నగర్‌లో తహసీల్దార్‌తో మాట్లాడుతున్న హైవే అథారిటీ అధికారులు

నిజాంసాగర్(జుక్కల్): మెదక్– బాసర రహదారి విస్తరణ పనులు రెండు, మూడు నెలల్లో ప్రారంభిస్తామని నేషనల్ హైవే అథారిటీ ఎఈ శ్రీధర్‌కుమార్ అన్నారు. గురువారం మహమ్మద్‌నగర్ మండల కేంద్రంలో రోడ్డు విస్తరణ పనులకు సంబంధించి స్థానిక తహశీల్దార్ క్రాంతికుమార్‌తో చర్చించారు. రహదారి విస్తరణ పనుల్లో భూములు కోల్పోతున్న రైతుల వివరాలు సేకరించారు. ప్రభుత్వ పరంగా భూములకు పరిహారం అందేలా చూస్తామన్నారు. రహదారి విస్తరణ పనులకు రైతులు, వ్యాపారస్తులు సహకరించాలన్నారు. భూములు, వ్యాపార సముదాయలు కోల్పోతున్న రైతులకు ముందుగా నోటీసులు ఇస్తామని చెప్పారు. ఎల్లారెడ్డి నుంచి రుద్రూర్ వరకు 51 కిలోమీటర్ల వరకు విస్తరణ పనులకు గాను రూ. 402.53 కోట్లు మంజూరు అయ్యాయ న్నారు. ఆయన వెంట మహమ్మద్‌నగర్ గ్రామ పంచాయతీ కార్యదర్శి సతీష్ తదితరులు ఉన్నారు.

సస్పెక్ట్ షీట్ నేరస్తులకు కౌన్సెలింగ్



మాట్లాడుతున్న ఎస్‌హెచ్‌వో చంద్రశేఖర్ రెడ్డి

కామారెడ్డి క్రైం: గొడవలు, కొట్లాటలు, దొంగతనాలు వదిలి సత్ప్రవర్తనతో మెలగాలని ఎస్‌హెచ్‌వో చంద్రశేఖర్‌రెడ్డి సస్పెక్ట్ షీట్ ఉన్న పాత నేరస్తులకు సూచించారు. పట్టణ పోలీస్‌స్టేషన్‌లో గురువారం వారికి కౌన్సెలింగ్ ఇచ్చారు. నేరాలకు దూరంగా ఉంటూ సత్ప్రవర్తనతో మెలుగుతున్నట్లు నిర్ధారణ అయితేనే సస్పెక్ట్ షీట్‌ను ఎత్తివేయడానికి ఉన్నతాధికారులకు నివేదిస్తామని స్పష్టం చేశారు. అందుకు విరుద్ధంగా ప్రవర్తిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

అభివృద్ధి పనులు ప్రారంభించాలి



లింగంపేట(ఎల్లారెడ్డి) : మంజూరైన పనులు వెంటనే ప్రారంభించాలని ఎమ్మెల్యే మదన్ మోహన్‌రావు అధికారులను ఆదేశించినట్లు కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు బుర్ర నారాగౌడ్ తెలిపారు. గురువారం హైదరాబాదులోని ఎమ్మెల్యే నివాసంలో పలువురు నాయకులు కలిశారు. ఈ సందర్భంగా మత్తడి పోచమ్మ ఆలయం వరకు బీటీ రోడ్డు, సంత నిర్వహించే సానాది రోడ్డు పనులు ప్రారంభించాలని నాయకులు కోరగా ఆయన సానుకూలంగా స్పందించి పనులు ప్రారంభించాలని అధికారులను ఆదేశించారు. ఎమ్మెల్యేను కలిసిన వారిలో సాయిరాం, రాజు, నగేశ్, కిరణ్, ఖుద్దూస్ తదితరులున్నారు.

ముమ్మరంగా చెరుకు క్రషింగ్

సదాశివనగర్: మండలంలోని అడ్లూర్‌ఎల్లారెడ్డి గాయత్రి షుగర్స్ ఫ్యాక్టరీలో చెరుకు క్రషింగ్ ముమ్మరంగా కొనసాగుతోంది. బుధవారం నాటికి 2లక్షల 19వేల 287 టన్నుల క్రషింగ్ జరిగినట్లు ఫ్యాక్టరీ వైస్ ప్రెసిడెంట్ వేణుగోపాల్ రావు గురువారం తెలిపారు.

వర్ని ఏఎంసీ కార్యదర్శి సస్పెన్షన్

వర్ని: వర్ని వ్యవసాయ మార్కెట్ కమిటీ కార్యదర్శి శ్రీనివాస్‌ను సస్పెండ్ చేస్తూ ఉత్తర్వులు జారీ చేసినట్లు జిల్లా మార్కెటింగ్ అధికారిణి గంగు గురువారం తెలిపారు. ఈనెల 19న 'అవినీతి వర్ని ఏఎంసీ' అనే శీర్షికన 'సాక్షి'లో ప్రచురితమైన కథనానికి స్పందించిన రాష్ట్ర డైరెక్టర్ ఆఫ్ మార్కెటింగ్ డీఎం లక్ష్మీబాయి కార్యదర్శిని సస్పెండ్ చేస్తూ ఉత్తర్వులు జారీ చేసినట్లు జిల్లా అధికారిణి గంగు వెల్లడించారు. విధుల్లో నిర్లక్ష్యం, అధికారుల అనుమతి లేకుండా గోడౌన్లలో రైతుల బియ్యాన్ని నిల్వ ఉంచడం, ఏఎంసీకి చెందిన క్లీనర్ యంత్రాలను నిర్లక్ష్యంగా పడివేయడం, 30 క్లీనర్ల మోటార్లు గల్లంతు కావడంపై విచారణ చేపట్టి కార్యదర్శిపై సస్పెన్షన్ వేటువేసినట్లు తెలిపారు.

క్రైం కార్నర్

వరద కాలువలో రైతు గల్లంతు



నీటిలో గల్లంతైన సాయన్న

బాల్కొండ: వరద కాలువలో ఓ రైతు గల్లంతైన ఘటన మండలంలోని బోదెపల్లిలో గురువారం చోటు చేసుకుంది. స్థానికులు, ఏఎస్సై శంకర్ తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన చెందిన గడ్డం చిన్నసాయన్న(60) అనే రైతు వరద కాలువలో పంపు సెట్‌ల మోటర్ వైర్లు, పంపు సెట్ ఫుట్‌బాల్‌లో ఏదైన సమస్య వస్తే నీటిలో మునిగి మరమ్మతు పనులు చేస్తుంటాడు. ఈ క్రమంలో గ్రామానికి చెందిన ఇద్దరి రైతుల పంపు సెట్ల వైర్లలో సమస్య ఉండటంతో పంపు సెట్ వద్ద నీట మునిగి ఓ పంపు సెట్‌కు విద్యుత్తు వైర్ తీసుకొచ్చాడు. మరో పంపుసెట్ వద్ద విద్యుత్తు తీగ కోసం నీట మునిగి తిరిగి రాలేదు. దీంతో విషయం తెలుసుకున్న కుటుంబీకులు పోలీసులకు సమాచారం అందించారు. గజఈత గాళ్ల సహాయంతో గాలింపు చర్యలు చేపట్టారు. రాత్రికి వరకు ఆచూకీ లభించలేదు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్సై పేర్కొన్నారు.

స్వగ్రామానికి చేరిన మృతదేహం



రాజేశ్వర్(ఫైల్)

మాక్లూర్: బతుకుదెరువు కోసం దుబాయి వెళ్లిన ఓ వ్యక్తి మృతదేహం గురువారం స్వగ్రామానికి చేరుకుంది. గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని చిక్లీ గ్రామానికి చెందిన గైని రాజేశ్వర్ (52) బతుకుదెరువు నిమిత్తం దుబాయి వెళ్లాడు. అక్కడ చేస్తున్న పనికి సరైన వేతనం రావడం లేదంటూ మనస్తాపానికి గురై ఈ నెల 6న ఆత్మహత్య చేసుకున్నాడు. ప్రజాప్రతినిధుల చొరవతో రాజేశ్వర్ మృతదేహం స్వగ్రామానికి చేరుకుంది. అనంతరం నిర్వహించిన అంత్యక్రియల్లో గ్రామస్తులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

పాన్‌షాపులో గంజాయి విక్రయం



నిందితుడి అరెస్టు చూపుతున్న పోలీసులు

ఖలీల్‌వాడి: నగరంలోని గుర్బాబాది రోడ్‌లో కమల్‌సింగ్‌కు చెందిన పాన్ షాపులో దాడి నిర్వహించి 550 గ్రాముల ఎండు గంజాయిని స్వాధీనం చేసుకున్నట్లు ఎక్సైజ్ టాస్క్‌ఫోర్స్ సీఐ విలాస్ గురువారం తెలిపారు. గంజాయిని సీజ్ చేసి కమల్‌సింగ్‌కు అరెస్టు చేసినట్లు చెప్పారు. దాడిలో ఎక్సైజ్ ఎస్సై గంగాధర్, సిబ్బంది పాల్గొన్నారు.

బైక్ చోరీ కేసులో ఇద్దరి అరెస్ట్

మోపాల్: బైకులను చోరీ చేసిన ఘటనలో ఇద్దరి నిందితులను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్సై గంగాధర్ తెలిపారు. మండల కేంద్రంలోని పీఎస్‌లో గురువారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఎస్సై మాట్లాడారు. మోపాల్‌లో వాహనాల తనిఖీ చేస్తున్న సమయంలో నగరంలోని అర్సపల్లికి చెందిన షేక్ సమీర్, మహ్మద్ అమేర్‌ఖాన్‌లు రెండు నంబర్‌ప్లేట్ లేని బైక్‌లపై మోపాల్‌లో సంచరిస్తుండగా వారిని పట్టుకొని విచారించగా బైక్‌లను దొంగతనం చేసినట్లు ఒప్పుకున్నారు. దీంతో వీరిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్సై పేర్కొన్నారు.

డివైడర్‌ను ఢీకొని ఒకరికి గాయాలు

ఖలీల్‌వాడి: నగరంలోని బోధన్ రోడ్డులో ఉన్న ఓ డివైడర్‌ను ఢీకొన్న ఘటనలో యువకుడికి తీవ్ర గాయాలయ్యాయి. సికింద్రాబాద్‌కు చెందిన ఓ యువకుడు బైక్‌పై బోధన్ రోడ్డుగుండా వెళ్తుండగా ప్రమాదవశాత్తు డివైడర్‌ను ఢీకొన్నాడు. ఈ ఘటనలో అతడికి తీవ్రగాయాలు కావడంతో అక్కడే విధు ల్లో ఉన్న ట్రాఫిక్ కానిస్టేబుల్ సంజీవ్‌కుమార్ ఆస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌హెచ్‌వో విజయ్‌బాబు తెలిపారు.

ఇసుక ట్రాక్టర్ల పట్టివేత



వేల్పూర్: ప్రభుత్వ అనుమతి లేకుండా అక్రమంగా తరలిస్తున్న మూడు ఇసుక ట్రాక్టర్లను మండలంలోని పడగల్‌లో గురువారం పట్టుకున్నట్లు ఎస్సై వినయ్‌కుమార్ తెలిపారు. సుంకెట వాగు నుంచి బాల్కొండ వైపు ఇసుక తరలిస్తున్నారన్న సమాచారం మేరకు ట్రాక్టర్లను తనిఖీ చేయగా ఎలాంటి అనుమతి లేకుండా ఇసుకను తరలిస్తున్న ట్రాక్టర్లను పట్టుకొని పీఎస్‌కు తరలించినట్లు పేర్కొన్నారు. డ్రైవర్‌పై కేసు నమోదు చేసినట్లు తెలిపారు. ఎవరైనా ప్రభుత్వ అనుమతి లేకుండా ఇసుకను తరలిస్తే కేసు నమోదు చేస్తామని హెచ్చరించారు.

సమావేశానికి తరలిన కాంగ్రెస్ శ్రేణులు



కాంగ్రెస్ బూత్ లెవెల్ ఏజెంట్ల సమావేశంలో పాల్గొన్న భిక్కనూరు మండల నేతలు



నాగిరెడ్డిపేట నుంచి హైదరాబాద్‌కు బయల్దేరుతున్న కాంగ్రెస్ బీఎల్‌ఏలు



హైదరాబాద్‌లో బూత్ కమిటీ కన్వీనర్లు

కామారెడ్డి టౌన్ : హైదరాబాద్‌లో జరిగిన కాంగ్రెస్ పార్టీ బూత్ లెవెల్ ఏజెంట్ల సమావేశానికి జిల్లా కేంద్రం నుంచి కాంగ్రెస్ నాయకులు గురువారం తరలి వెళ్లారు. పార్టీ కార్యాలయం నుంచి ప్రత్యేక వాహనాల్లో సమావేశానికి హాజరయ్యారు. కార్యక్రమంలో డీసీసీ అధ్యక్షుడు కైలాస్ శ్రీనివాస్‌రావు, లీగల్ సెల్ కన్వీనర్ దేవరాజ్‌గౌడ్, పట్టణ అధ్యక్షుడు పండ్లరాజు, బ్లాక్‌సెల్ అధ్యక్షుడు గోనె శ్రీనివాస్, నాయకులు లక్ష్మణ్, గడ్డం చంద్రశేఖర్, సుధాకర్ ఉన్నారు.

బూత్ లెవల్ సమావేశంలో నాయకులు

భిక్కనూరు : హైదరాబాద్ లాల్‌బహదూర్ స్టేడియంలో గురువారం కాంగ్రెస్‌పార్టీ అధ్వర్యంలో నిర్వహించిన బూత్ లేవల్ ఏజెంట్ల సమావేశంలో భిక్కనూరు మండల కాంగ్రెస్‌నేతలు పాల్గొన్నారు. పాల్గొన్న వారిలో ఎంపీపీ గాలిరెడ్డి, పీసీసీ కార్యదర్శి ఇంద్రకరన్‌రెడ్డి, ఉపాధ్యక్షుడు చంద్రకాంత్ రెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు బల్యాల సుదర్శన్‌లు పాల్గొన్నారు.

హైదరాబాద్‌కు తరలిన కాంగ్రెస్ బీఎల్‌ఏలు

నాగిరెడ్డిపేట(ఎల్లారెడ్డి) : మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన కాంగ్రెస బూత్‌స్థాయి ఏజెంట్లు గురువారం ఎల్లారెడ్డి ఎమ్మెల్యే మదన్‌మోహన్ రావు ఆదేశాల మేరకు హైదరాబాద్‌కు తరలి వెళ్లారు. వెళ్లిన వారిలో కాంగ్రెస్ బీఎల్‌ఏలు లక్ష్మణ్, ఇమామ్, వెంకట్, ఆరీఫ్, విక్రమ్, చంటి, చంద్రం, మల్లేశం తదితరులున్నారు.

లింగంపేట నుంచి..

లింగంపేట(ఎల్లారెడ్డి): హైదరాబాదులో నిర్వహించిన బూత్‌లెవల్ కన్వీనర్ల శిక్షణ శిబిరానికి గురువారం లింగంపేట మండలానికి చెందిన కాంగ్రెస్ నాయకులు తరలివెళ్లారు. వెళ్లిన వారిలో రాష్ట్ర మైనారిటీ సెల్ ప్రధాన కార్యదర్శి రఫీక్, ఫతియోద్దీన్, వినోద్‌కుమార్, ప్రకాశ్‌నాయక్‌తోపాటు పలువురు ఉన్నారు.

ఇంటర్ పరీక్షలను పకడ్బందీగా నిర్వహించాలి



మాట్లాడుతున్న కలెక్టర్ పాటిల్

కామారెడ్డి క్రైం: ఇంటర్ పరీక్షలను పకడ్బందీగా నిర్వహించాలని కలెక్టర్ జితేష్ వి పాటిల్ సూచించారు. గురువారం కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఫిబ్రవరి 1 నుండి 15 వరకు రెండు సెషన్స్‌లో ప్రాక్టికల్ పరీక్షలు జరుగుతాయన్నారు. 16న ఇంగ్లిష్ ప్రాక్టికల్ పరీక్ష, 19న ఎన్విరాన్మెంట్ పరీక్షలు జరుగుతాయని తెలిపారు. వార్షిక పరీక్షలు ఫిబ్రవరి 28 నుండి మార్చ్ 14 వరకు ఉంటాయని పేర్కొన్నారు. కామారెడ్డి, బాన్సువాడ, బిచ్కుందలోని 50 కేంద్రాల్లో పరీక్షలు నిర్వహించనున్నట్లు తెలిపారు. విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకోవాలని ఆయా శాఖల అధికారులకు సూచించారు. ఎస్పీ సింధు శర్మ, ఆర్టీసీ డీఎం ఇందిర, ఇంటర్ నోడల్ అధికారి షేక్ సలాం పాల్గొన్నారు.

సేవా కార్యక్రమాల్లో ముందుండాలి



ఎన్‌ఎస్‌ఎస్ ముగింపు కార్యక్రమంలో మాట్లాడుతున్న షేక్ సలాం

మాచారెడ్డి : విద్యార్థులు సేవాకార్యక్రమాల్లో ముందుంటూ నాయకత్వ లక్షణాలను పెంపొందించుకోవాలని డీఐఈవో షేక్ సలాం అన్నారు. ప్రభుత్వ జూనియర్ కళాశాల ఎన్‌ఎస్‌ఎస్ యూనిట్ 1, 2 వలంటీర్ల ఆధ్వర్యంలో చుక్కాపూర్, లక్ష్మీరావులపల్లిలో శీతాకాల శిబిరాలు గురువారం ముగిశాయి. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ బుద్ధిరాజ్, ఎన్‌ఎస్‌ఎస్ ప్రోగ్రాం అధికారులు రామకృష్ణారెడ్డి, తిరుపతిగౌడ్, సర్పంచ్ నవీన్ కుమార్, ఉప సర్పంచ్ నవీన్ రెడ్డి తదితరులున్నారు.

జాతీయస్థాయి బేస్‌బాల్ పోటీలకు ఎంపిక



అభినందిస్తున్న ఉపాధ్యాయులు

డిచ్‌పల్లి: మండలంలోని ధర్మారం(బి)లో ఉన్న సాంఘిక సంక్షేమ పాఠశాల/కళాశాలకు చెందిన విద్యార్థిని మహిత జాతీయ బేస్‌బాల్ పోటీలకు ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ బి.సంగీత గురువారం తెలిపారు. ఇటీవల నిర్వహించిన రాష్ట్రస్థాయి బేస్‌బాల్ పోటీల్లో ఉత్తమ ప్రతిభ కనబర్చి జాతీయస్థాయికి ఎంపికైందన్నారు. ఛత్తీస్‌గఢ్‌లో ఈనెల 28 నుంచి ఫిబ్రవరి 1 వరకు నిర్వహించే 67వ జాతీయస్థాయి స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ అండర్–14 బేస్‌బాల్ పోటీల్లో మహిత పాల్గొంటుందన్నారు. అనంతరం పాఠశాలలో నిర్వహించిన కార్యక్రమంలో విద్యార్థిని మహితను ప్రిన్సిపాల్ సంగీతతో పాటు ఫిజికల్ డైరెక్టర్ నీరజారెడ్డి, పీఈటీలు జ్యోత్స్న, దమయంతి, హౌస్ టీచర్స్ అభినందించారు.

రాష్ట్ర పోటీల్లో జిల్లా క్రీడాకారుల ప్రతిభ



క్రీడాకారులను అభినందిస్తున్న నిర్వాహకులు

నిజామాబాద్‌నాగారం: హైదరాబాద్‌లో ఇటీవల నిర్వహించిన రాష్ట్ర స్థాయి తైక్వాండో చాంపియన్‌షిప్‌లో నిజామాబాద్ తైక్వాండో సబ్ జూనియర్ క్రీడాకారులు సత్తా చాటారు. గోపికృష్ణ గోల్డ్ మెడల్ సాధించి జాతీయస్థాయి తైక్వాండోకు ఎంపిక కాగా, సహస్ర రాథోడ్ సిల్వర్ మెడల్, భవ్య, చంద్ర ఆదిత్య, మోక్షిత్ బ్రాంజ్ మెడల్స్ సాధించారని జేసీఐ ప్రెసిడెంట్, నిజామాబాద్ తైక్వాండో కార్యదర్శి కె. మనోజ్ కుమార్ తెలిపారు. అనంతరం గెలుపొందిన క్రీడాకారులను తెలంగాణ తైక్వాండో అసోసియేషన్ కార్యదర్శి, గ్రాండ్ మాస్టర్ ప్రవీణ్ కుమార్, పలువురు అభినందించారు.

గిఫ్ట్ పేరిట బంగారం అపహరణ

ఖలీల్‌వాడి: నగరంలోని సీఎస్‌ఐ చర్చి ఎదుట పేదలకు గిఫ్టులు అందిస్తున్నారని ఓ మహిళను నమ్మించి బంగారం, వెండి అపహరించినట్లు ఎస్సై ప్రవీణ్‌కుమార్ గురువారం తెలిపారు. ఎస్సై తెలిపిన వివరాల ప్రకారం.. సీఎస్‌ఐ ప్రాంతానికి చెందిన చంద్రవ్వ పలు ఇళ్లల్లో పని చేస్తుందని, సాయంత్రం ఇంటికి వెళ్తుండగా ఇద్దరు చర్చి ఎదుట గిఫ్టులు ఇస్తున్నారని చెప్పి ఆమెను సమీప ప్రాంతంలోకి తీసుకెళ్లి బంగారం, వెండిని అపహరించారు. దీంతో బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

ఆగ్రోస్ దుకాణాల తనిఖీ

డొంకేశ్వర్(ఆర్మూర్): రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు జిల్లాలో ఆగ్రోస్ ఫర్టిలైజర్స్, సీడ్స్‌ను విక్రయించే ఆగ్రోస్ దుకాణాల తనిఖీ జరుగుతోంది. తహసీల్దార్లు, మండల వ్యవసాయాధికారులు కలిసి ఈ కేంద్రాల్లో రెండు రోజులుగా తనిఖీ చేస్తున్నారు. లైసెన్సులు, ఫర్టిలైజర్స్ విక్రయాల వివరాలను పరిశీలిస్తున్నారు.

ఇగ్నైట్ ఇండియా టీయూ కో–ఆర్డినేటర్‌గా రవీందర్‌రెడ్డి



రవీందర్‌రెడ్డి

తెయూ(డిచ్‌పల్లి): ఇగ్నైట్ ఇండియా టీయూ కో–ఆర్డినేటర్‌గా ఆచార్య రవీందర్ రెడ్డిని యూజీసీ సెక్రటరీ దీపాలి జైస్వాల్ నియమించినట్లు గురువారం నియామక ఉత్తర్వులు అందాయి. యూనివర్సిటీ గ్రాంట్స్ కమిషన్ ఆధ్వర్యంలో ఇగ్నైటింగ్ ఇండియా–2047 విజన్ ఆఫ్ ది డెవలప్‌మెంట్ పేరుతో ఫిబ్రవరిలో విశ్వవిద్యాలయాలు, కళాశాలలు నిర్వహించే యువ మంథన్ ఎక్స్‌పర్మెంటల్ లెర్నింగ్ కార్యక్రమానికి నియామకం కావడంపై రవీందర్‌రెడ్డి సంతోషం వ్యక్తం చేశారు. యూజీ, పీజీ విద్యార్థులకు యువ మంథన్ మోడల్ యునైటెడ్ నేషన్ పేరుతో నూతన ఆవిష్కరణలు, గ్లోబల్ డిప్లమసి, స్కిల్ డెవలప్‌మెంట్, భారత ప్రజాస్వామ్య భవిష్యత్తు అనే అంశాలపై వివిధ కార్యక్రమాలు నిర్వహించాలని ఉత్తర్వులో పేర్కొన్నారని రవీందర్‌రెడ్డి పేర్కొన్నారు. అనంతరం రవీందర్‌రెడ్డికి రిజిస్ట్రార్ యాదగిరి, సీనియర్ అధ్యాపకులు అభినందనలు తెలిపారు.

విత్తన ఎంపికే ప్రధానం

- జిల్లాలో సుమారు 33 వేల ఎకరాల్లో పసుపు సాగు

బాల్కొండ: పసుపు తవ్వకాలు జోరందుకున్న నేపథ్యంలో విత్తన ఎంపికలో రైతులకు బాల్కొండ ఉద్యానవనశాఖ అధికారి రోహిత్ పలు సూచనలు చేస్తున్నారు. ప్రస్తుతం తవ్వుతున్న పసుపులో నుంచే విత్తనం నిల్వ చేసే రైతులు.. దుంపకుళ్లు సోకిన పంట నుంచి విత్తనాన్ని తీసుకోవద్దని హెచ్చరిస్తున్నారు. విత్తన ఎంపికలో రైతులకు పలు సూచనలు చేస్తున్నారు.

తీసుకోవాల్సిన జాగ్రత్తలు

విత్తనంగా తీసుకున్న పసుపు కొమ్మును లీటర్ నీటికి మైటాలాక్సిల్ లేదా సైమక్సానిల్ 2.5 గ్రాములు, 2 మిల్లీలీటర్లు మలథయాన్ లేదా 1.6 మోనోక్రోటపాస్‌ను కలిపిన ద్రావణాన్ని పట్టించాలి. అరగంటపాటు విత్తన పసుపును ఆరబెట్టాలి. అనంతరం పసుపు కొమ్మును కుప్పగా వేసుకోవాలి. దీంతో దుంపకుళ్లు తెగుళ్లు కలిగించే శిలీంధ్రాలు, దుంప నుంచి రసం పీల్చే పొలుసు పురుగులు చనిపోతాయి. దీంతో విత్తనానికి తెగుళ్లు లేకుండా పోతాయి. పసుపు విత్తే ముందు ఎకరానికి మూడు క్వింటాళ్ల వేప పిండి తప్పనిసరిగా వేయాలి. దీంతో అధిక పంట దిగుబడి సాధించొచ్చు.


పసుపు పంట

పసుపుఆకును కప్పొద్దు..

విత్తన పసుపు నిల్వ చేసిన కుప్పపై పసుపు ఆకును కప్పకూడదు. పండించిన పసుపు పంట ఆకులపై ఇది వరకే మచ్చాకు తెగుళ్లు సోకి ఉంటుంది. దీంతో మచ్చాకు సోకిన శిలీంధ్రాలు ఆకులపై ఉంటాయి. ఆకును విత్తన కుప్పపై కప్పడం వల్ల శిలీంధ్రాలు విత్తన కొమ్ముకు సోకే ప్రమాదం ఉంది. ఈ నేపథ్యంలో పసుపు ఆకుకు బదులుగా వేపాకు లేదా మోదుగాకు, టేకు ఆకులను కప్పాలి. విత్తన ఎంపిక సరిగా ఉంటే పంట దిగుబడి అధికంగా ఉంటుంది.

జిల్లాలో సుమారు 33వేల ఎకరాల విస్తీర్ణంలో పసుపు సాగు చేస్తున్నారు. కానీ విత్తన ఎంపిక సరిగాలేక పోవడంతో రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు. పసుపు విత్తనం మార్కెట్‌లో లభించకపోవడంతో రైతులు తాము పండించిన పంటలో నుంచే విత్తనం నిల్వ చేసుకోవాలి. కానీ.. తరాలుగా పసుపు సాగు చేస్తున్న రైతులు విత్తన పసుపును నిల్వ చేసుకోవడం, ఎంపిక చేసుకోవడంలో ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవడం లేదు. పసుపు పంటకు ప్రధాన తెగుళ్లు దుంపకుళ్లు. ఈ తెగుళ్ల వలన పసుపు రైతు తీవ్రంగా నష్టపోతాడు. తెగుళ్లు వ్యాపించకుండా ఉండాలంటే విత్తన ఎంపికనే ప్రధానం. విత్తన పసుపును దుంపకుళ్లు సోకిన పంట భూమిలో నుంచి వేయడం వల్ల విత్తిన పసుపునకు తప్పకుండా దుంపకుళ్లు సోకుతుంది.




మంచుకురిసే..

దట్టంగా కమ్ముకున్న పొగమంచు మనసును మురిపించింది. గురువారం ఉదయం ఎనిమిది గంటలైనా భానుడి కిరణాలను పొగమంచు కప్పి ఉంచింది. వాహనదారులు లైట్లు వేసుకొని ప్రయాణించాల్సిన పరిస్థితి ఏర్పడింది. సిరికొండ మండల కేంద్రంలోని దృశ్యాలివి.
– సిరికొండ

వలస కార్మికుల సమస్యలపై అధ్యయనం

- యూఏఈలో పర్యటించనున్న వలస కార్మిక సంఘాల ప్రతినిధులు, కాంగ్రెస్ ఎన్‌ఆర్‌ఐ సెల్ నాయకులు
- గల్ఫ్ సంక్షేమ బోర్డు ఏర్పాటుకు కాంగ్రెస్ ప్రభుత్వం సుముఖత నేపథ్యంలో..

మోర్తాడ్(బాల్కొండ): రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వం ప్రవాసీ విధానం(ఎన్‌ఆర్‌ఐ పాలసీ) లేదా గల్ఫ్ సంక్షేమ బోర్డును ఏర్పాటు చేయడానికి సుముఖత వ్యక్తం చేసిన నేపథ్యంలో వలస కార్మికులు ఎదుర్కొంటున్న ప్రధాన సమస్యలపై అధ్యయనం చేయడానికి ఒక బృందం యూఏఈలో పర్యటించనుంది. యూఏఈలో సెలవు రోజులైన శని, ఆదివారాల్లో వలస కార్మికులను కలిసి వారి సమస్యలు తెలుసుకోడానికి కార్మిక సంఘాల నాయకులు, కాంగ్రెస్ ఎన్‌ఆర్‌ఐ సెల్ ప్రతినిధులు వెళ్తున్నారు. ఈ మేరకు శుక్రవారం ఉదయం శంషాబాద్ ఎయిర్‌పోర్టు నుంచి దుబాయ్‌కు చేరుకోనున్నారు. అక్కడ దుబాయ్, షార్జా, అబుదాబి, బార్ దుబాయ్‌లలోని వలస కార్మికుల క్యాంపులలో బస చేయనున్నారు.

రాష్ట్ర ప్రభుత్వం వలస కార్మికుల సంక్షేమం కోసం అమలు చేయబోయే పథకాల కోసం ఈ స్టడీ టూర్ కీలకం కానుందని అధ్యయనం కోసం వెళుతున్న ప్రతినిధులు వెల్లడించారు. ప్రవాసీ మిత్ర లేబర్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు స్వదేశ్ పరికిపండ్ల, జగిత్యాల జిల్లా సారంగాపూర్ జెడ్పీటీసీ సభ్యుడు, గల్ఫ్ రిటర్న్ పత్తిరెడ్డి రాజేశ్వర్ రెడ్డి, టీపీసీసీ ఎన్‌ఆర్‌ఐ విభాగం చైర్మన్ మాజీ రాయబారి బీఎం వినోద్‌కుమార్, గల్ఫ్ ఎన్‌ఆర్‌ఐ సెల్ కన్వీనర్ సింగిరెడ్డి నరేశ్‌రెడ్డి, టీపీసీసీ కార్యదర్శి జెలాల సైదయ్య బాబులు ఇక్కడి నుంచి వెళుతున్నవారిలో ఉన్నారు. జేసీవా పర్యటనలో ఉన్న ఎమిగ్రంట్స్ వెల్ఫేర్ ఫోరం అధ్యక్షుడు మంద భీంరెడ్డి దుబాయ్‌కు చేరుకుని ఈ బృందంతో కలువనున్నారు. వలస కార్మికులతో పాటు సామాజిక, సాంస్కృతిక సంస్థల నాయకులతో కలిసి గల్ఫ్ కార్మికుల సమస్యలపై వివరాలను నమోదు చేయనున్నారు. గల్ఫ్ సంక్షేమ బోర్డు ఏర్పాటు అయ్యే తరుణంలో కార్మిక సంఘాల ప్రతినిధుల అధ్యయనం ప్రాధాన్యతను సంతరించుకుంది.



కార్మికులను భాగస్వాములను చేయాలి



రాష్ట్ర ప్రభుత్వం తెలంగాణలో ఏర్పాటు చేయబోయే గల్ఫ్ సంక్షేమ బోర్డు, ఎన్‌ఆర్‌ఐ పాలసీలో వలస కార్మికులను భాగస్వాములను చేయాలనే ఉద్దేశంతో అధ్యయనం కోసం వెళుతున్నాం. కార్మికులు గతంలో ఎదుర్కొన్న సమస్యలు ఏమిటి కొత్త కొత్తగా ఎలాంటి ఇబ్బందులు పడుతున్నారు. వారి ఆకాంక్షలకు అనుగుణంగా బోర్డు ఏర్పడితేనే ప్రయోజనం అని మా భావన.
– స్వదేశ్ పరికిపండ్ల, ప్రవాసీ మిత్ర లేబర్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు

బాబా ఆలయంలో 'మధ్యాహ్న భోజనం'


సాయిబాబా ఆలయంలో భోజనం చేస్తున్న విద్యార్థులు

ఎడపల్లి(బోధన్): మెనూ ప్రకారం భోజనం అందకపోవడంతో విద్యార్థులు కడుపునిండా తినలేని పరిస్థితి ఉంది. ఎడపల్లి మండల కేంద్రంలోని ఉన్నత పాఠశాలలో మధ్యాహ్న భోజనం సరిగా లేకపోగా, ప్రభుత్వ ఆదేశాల ప్రకారం వారానికి మూడు రోజులు కోడిగుడ్లు ఇవ్వాల్సి ఉండగా, ఒక్క రోజుకూడా ఇవ్వడం లేదనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి. మధ్యాహ్న భోజనం సరిగా ఉండకపోవడంతో విద్యార్థులు గ్రామంలో జరిగే శుభకార్యాలకు వెళ్లి భోజనం చేస్తున్నారు. ప్రతి గురువారం సాయిబాబా ఆలయంలో నిర్వహించే అన్నదానంలో భోజనం చేస్తున్నారు. ఎప్పటిలాగే ఈ గురువారం కూడా ఆలయానికి వెళ్లి భోజనం చేశారు. ఈ విషయమై హెచ్ఎం సాయిలును వివరణ కోరగా.. మరోసారి విద్యార్థులు బయటికి వెళ్లకుండా చూస్తామని, మధ్యాహ్న భోజనంలో గుడ్డు అందించని మాట వాస్తవమేనని అన్నారు.



అద్దె భవనాలే దిక్కు


ప్రైవేట్ భవనంలో కొనసాగుతున్న మైనారిటీ గురుకుల బాలుర పాఠశాల, కళాశాల

- రూ.లక్షల్లో అద్దె చెల్లింపు
- కనీస వసతులు కరువు

పెర్కిట్(ఆర్మూర్): ఆర్మూర్ పట్టణంతోపాటు నూతనంగా ఏర్పడిన ఆలూర్ మండలంలో ప్రభుత్వ కార్యాలయాలు, గురుకులాలకు పక్కా భవనాలు లేకపోవడంతో అద్దె భవనాల్లో కొనసాగుతున్నాయి. గత ప్రభుత్వం గురుకులాల ఏర్పాటుకు పెద్ద పీట వేసినప్పటికీ.. పక్కా భవనాలను నిర్మించ లేకపోయింది. దీంతో అద్దె భవనాల్లో మౌళిక వసతులు లేకపోవడంతో విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు. ఇటీవల ఆర్మూర్ ఎమ్మెల్యే రాకేశ్‌రెడ్డి హౌసింగ్ బోర్డులోని సాంఘిక సంక్షేమ బాలికల డిగ్రీ కళాశాలను సందర్శించగా, విద్యార్థినులు తమ సమస్యలను ఏకరవు పెట్టారు. ప్రైవేట్ భవనాల్లో విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా మౌళిక వసతులు కల్పించలేని పరిస్థితి నెలకొంది. అలాగే నెలకు రూ.లక్షల్లో అద్దె చెల్లించాల్సిన పరిస్థితి నెలకొంది. ఆయా సంక్షేమ శాఖల నుంచి బిల్లులు రావడం ఆలస్యమైతే భవనాల యజమానులు ప్రిన్సిపాళ్లపై ఒత్తిడి తీసుకురావడం తలనొప్పిగా మారింది. ఆర్మూర్ పట్టణంలో గతంలో నిర్మించిన స్త్రీ శక్తి భవనం ఆర్డీవో కార్యాలయానికి కేటాయించడంతో మహిళాసంఘాల సమావేశాలు నిర్వహించేందుకు ఇబ్బందులు తప్పడం లేదు. ఆర్డీవో కార్యాలయంతోపాటు ఎంపీఐ కార్యాలయం, హౌసింగ్ బోర్డులోని గురుకుల పాఠశాల, కళాశాలకు మామిడిపల్లి, కొటార్మూర్ గ్రామాల్లో స్థలాలను కేటాయించినప్పటికీ భవన నిర్మాణాలు చేపట్టలేదు. నిధులు మంజూరు చేయకపోవడంతో నిర్మాణాలు ప్రారంభం కాలేదు.


వెటర్నరీ ఆస్పత్రి భవనంలో కొనసాగుతున్న తహసీల్ కార్యాలయం

నూతన మండలంలో సైతం..

రెండు సంవత్సరాల క్రితం నూతనంగా ఏర్పాటైన ఆలూర్ మండలంలో ప్రభుత్వ కార్యాలయాల నిర్వహణకు అస్తవ్యస్తంగా ఉంది. తహసీల్ కార్యాలయం వెటర్నరీ ఆస్పత్రి భవనంలో కొనసాగుతుండగా, మండల పరిషత్, పంచాయతీరాజ్ శాఖ కార్యాలయాలు ఇప్పటికీ ఏర్పాటు చేయలేదు. దీంతో ఆలూర్ మండల ప్రజలు పనిమీద ఆర్మూర్ వెళ్లాల్సిన పరిస్థితి నెలకొంది. దీంతో మండల ప్రజలు అసహనం వ్యక్తం చేస్తున్నారు. నూతన ప్రభుత్వమైనా ఆలూర్‌లో అన్నిశాఖల కార్యాలయాలను ఏర్పాటు చేసి సొంత భవనాలను నిర్మించాలని మండల ప్రజలు కోరుతున్నారు.


శిథిలావస్థలో కోట


కొనసాగుతున్న కోనేరు నిర్మాణ పనులు

గోండు రాజుల కోటకు కొత్త కళ

గోండుల వైభవానికి చిహ్నంగా నిలిచిన ఉట్నూర్ డివిజన్ కేంద్రంలోని పురాతన గోండు రాజుల కోట పూర్వ వైభవాన్ని సంతరించుకుంటోంది. కేబీ కాంప్లెక్స్ సమీపంలోని ఈ కోట నిర్వహణ లోపంతో శిథిలావస్థకు చేరి కోనేరు, కోట ప్రధాన భాగాలు కూలిపోయాయి. దీన్ని పర్యాటక ప్రాంతంగా తీర్చిదిద్దాలని భావించిన అప్పటి ప్రభుత్వం రూ.2.30కోట్లు మంజూరు చేసింది. పనులు యుద్ధప్రాతిపదికన కొనసాగుతుండటంతో త్వరలోనే కోట కొత్త కళ సంతరించుకోనుంది.
– సాక్షి ఫొటోగ్రాఫర్, ఆదిలాబాద్


కొనసాగుతున్న పునర్నిర్మాణ పనులు

సంప్రదాయబద్ధంగా మహాపూజ

- జంగుబాయి క్షేత్రానికి తరలివచ్చిన భక్తులు
- ఎంపీ సోయం బాపూరావు ప్రత్యేక పూజలు

కెరమెరి(ఆసిఫాబాద్): కెరమెరి మండలంలోని మహరాజ్‌గూడ అడవుల్లో కొలువైన జంగుబాయి అమ్మవారి క్షేత్రంలో గురువారం మహాపూజ సంప్రదాయబద్ధంగా నిర్వహించారు. వివిధ ప్రాంతాల నుంచి భక్తులు భారీగా తరలివచ్చారు. ఆదిలాబాద్ ఎంపీ సోయం బాపూరావు కుటుంబ సమేతంగా అమ్మవారిని దర్శించుకున్నారు. మైసమ్మ, పోచమ్మ, రావుడ్ దేవతలకు మొక్కులు చెల్లించారు. అనంతరం సిద్ధికసలోని జై జంగు జైలింగు దీక్షాపరులతో కలిసి సిద్ధికసలోని గుహలోకి వెళ్లి పుణ్యస్నానం ఆచరించారు. జంగు, లింగు దేవతలు, శివలింగానికి పూజలు చేశారు. ఎంపీ మాట్లాడుతూ ప్రతిఒక్కరూ ఆధ్యాత్మికతను అలవర్చుకోవాలన్నారు. జంగుబాయి దేవస్థానం అభివృద్ధికి కృషి చేస్తామని హామీ ఇచ్చారు. కొందరు పని కట్టుకుని తనపై ఆరోపణలు చేస్తున్నారని, తుడుందెబ్బకు ఎలాంటి ద్రోహం చేయలేదని స్పష్టం చేశారు. ఆలయానికి రోడ్డు, తాగునీటి సౌకర్యం కల్పిస్తామని, టొప్లకసలో రూ.10లక్షలతో షెడ్డు ప్రారంభిస్తామన్నారు. కార్యక్రమంలో తెలంగాణ, మహారాష్ట్ర ఆలయ కమిటీ చైర్మన్లు కొడప జాకు, పెట్టి చందు, సర్పంచ్ లింబాదాస్, పూజారి హన్మంత్‌రావు, కటోడ నాగోరావు తదితరులు పాల్గొన్నారు.


గుహ వద్ద ఎంపీ సోయం బాపూరావు, నాయకులు, తదితరులు

ప్రొఫెసర్ కోదండరాం.. ఎమ్మెల్సీ

- గవర్నర్ కోటాలో పదవిపై హర్షం
- స్వస్థలం నెన్నెల మండలం జోగాపూర్

సాక్షి ప్రతినిధి, మంచిర్యాల: తెలంగాణ జన సమితి రాష్ట్ర అధ్యక్షుడు, టీజేఏసీ చైర్మన్ ప్రొఫెసర్ ముద్దసాని కోదండరాం గవర్నర్ కోటాలో ఎమ్మెల్సీగా ఎంపికయ్యారు. ఆయనకు పదవీ దక్కడంపై మంచిర్యాల జిల్లా వాసులు, సన్నిహితులు, స్నేహితులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఉమ్మడి కరీంనగర్ జిల్లా మానకొండూరు మండలం ఊటూరు నుంచి మంచిర్యాల జిల్లా నెన్నెల మండలం జోగాపూర్‌కు వలస వచ్చారు. తల్లిదండ్రులు జనార్దన్‌రెడ్డి, వెంకటమ్మ. ఏడుగురు సంతానంలో కోదండరాం ఒకరు. కోదండరాం 1955 సెప్టెంబర్ 5న జన్మించారు. భార్య సుశీల కాగా, వీరికి ఇద్దరు సంతానం. అందరూ ఉద్యోగ, వృత్తిరీత్యా వివిధ ప్రాంతాల్లో స్థిరపడ్డారు. ఆయన సోదరుడు రంగారెడ్డి కుటుంబం మాత్రం ప్రస్తుతం జోగాపూర్‌లోనే ఉంటోంది. బాల్యం నుంచే రాడికల్ భావజాలంతో పెరిగిన కోదండరాం ఉమ్మడి కరీంనగర్, వరంగల్, హైదరాబాద్‌లో విద్యాభ్యాసం పూర్తి చేశారు. ఉస్మానియా యూనివర్సిటీలో పొలిటికల్ సైన్స్ ప్రొఫెసర్‌గా బోధించి రిటైర్డ్ అయ్యారు. తెలంగాణ రాష్ట్ర ఉద్యమ సమయంలో రాజకీయ జేఏసీ చైర్మన్‌గా కీలకంగా వ్యవహరించారు. తెలంగాణ జన సమితి పార్టీ స్థాపించారు. ఉమ్మడి జిల్లా వాసులు అనేకమందితో సాన్నిహిత్యం ఉంది. తెలంగాణ విద్యావంతుల వేదిక, సింగరేణి ఓపెన్‌కాస్టులు, ప్రత్యేక రాష్ట్ర ఉద్యమ సమయంలోనూ ఇక్కడికి పలుమార్లు వచ్చారు. ఇప్పటికీ తమ వారసత్వంగా ఇల్లు, ఆస్తులు, భూములు ఉన్నాయి. 2018 అసెంబ్లీ ఎన్నికల్లో మంచిర్యాల నియోజకవర్గం నుంచి ఎమ్మెల్యే అభ్యర్థిగా పోటీ చేస్తారనే ప్రచారం జరిగింది. తాజాగా ఎమ్మెల్సీగా ఎన్నిక కావడంపై ఆయన సన్నిహితులు, స్నేహితులు గుర్తు చేసుకున్నారు.


కోదండరాం

'మంచిర్యాల–అంతర్గాం' బ్రిడ్జి నిర్మించాలి

- మాజీ ఎమ్మెల్యే గోనె ప్రకాశ్‌రావు

మంచిర్యాలటౌన్: మంచిర్యాల కాలేజీ రోడ్డు నుంచి అంతర్గాం వరకు గోదావరి నదిపై బ్రిడ్జి నిర్మించాలని మాజీ ఎమ్మెల్యే, ఆర్టీసీ మాజీ చైర్మన్ గోనె ప్రకాశ్‌రావు డిమాండ్ చేశారు. మంచిర్యాల, అంతర్గాంల మధ్య గోదావరి నదిపై బ్రిడ్జి నిర్మాణాన్ని పోరాడి సాధించామని తెలిపారు. మంచిర్యాల జిల్లా కేంద్రంలో గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కుమురంభీం ఆసిఫాబాద్‌తోపాటు మంచిర్యాల జిల్లాకు చెందిన ప్రజలు ఈ బ్రిడ్జి గుండా మంచిర్యాల నుంచి పెద్దపల్లి జిల్లా బసంత్‌నగర్ వరకు ప్రయాణిస్తే 45 నిమిషాలు ముందుగానే వెళ్తారని అన్నారు. 2018 ఎన్నికల సమయంలో సీఎం హోదాలో కేసీఆర్ శ్రీరాంపూర్‌లో ఇచ్చిన హామీ మేరకు బ్రిడ్జి నిర్మాణం కోసం అఖిలపక్షం ఆధ్వర్యంలో పోరాడామని అన్నారు. బ్రిడ్జి నిర్మాణానికి రూ.1.64 కోట్లు విడుదల కాగా, మూడు నెలల క్రితం టెండరు కూడా పూర్తి చేశారని తెలిపారు. ప్రస్తుతం పనులను ప్రారంభించడం వల్ల వర్షాకాలం నాటికి పిల్లర్ల నిర్మాణం పూర్తయి, బ్రిడ్జిని రెండేళ్లలో నిర్మించేందుకు అవకాశం ఉంటుందన్నారు. ఈ విషయమై ప్రస్తుత ఆర్‌అండ్‌బీ శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డికి వినతిపత్రం ఇచ్చానని అన్నారు. కొందరు మంచిర్యాల, అంతర్గాం బ్రిడ్జిని నిర్మించకుండా, ముల్కల్ల వద్ద నిర్మించాలని చూస్తున్నట్లు తన దృష్టికి వచ్చిందన్నారు. దాని వల్ల ప్రజలకు మేలు జరగకపోగా కోర్టు కేసులు, భూపరిహారం ఇలా ఏళ్ల తరబడి బ్రిడ్జి నిర్మాణానికి దూరంగా ఉండాల్సిన పరిస్థితి వస్తుందని, బ్రిడ్జిని ముల్కల్లకు ఎవరు మార్చాలని అనుకుంటున్నారో తెలియడం లేదని తెలిపారు. బ్రిడ్జి నిర్మాణాన్ని ఆపాలని ఎవరైనా చూస్తే తాను ఊరుకోబోనని స్పష్టం చేశారు.


మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే గోనె ప్రకాశ్‌రావు

ఖండేవ్ పుణ్యక్షేత్రానికి తొడసం వంశీయులు


మాసేమాల్ దేవతకు పూజలు చేస్తున్న తొడసం వంశస్తులు

నార్నూర్: తొడసం వంశస్తుల ఆరాధ్యదైవం ఖండేవ్ ఆలయ పుణ్యక్షేత్రానికి తొడసం వంశస్తులు సంప్రదాయ వాయిద్యాలతో ఎడ్లబండిపై గురువారం చేరుకున్నారు. బుధవారం రాత్రి మండలంలోని మాన్కాపూర్ వద్ద మాసేమాల్ దేవతకు ప్రత్యేక పూజలు చేశారు. రాత్రి అక్కడే బస చేశారు. గురువారం ఉదయం పుణ్యస్నానాలు ఆచరించిన తర్వాత ఆదివాసీ గిరిజనుల ఆచారం ప్రకారం పూజలు చేశారు. మధ్యాహ్నం ఎడ్లబండిపై కొందరు.. మరి కొందరు పూజ సామగ్రితో కాలినడకన ఖండేవుని పుణ్యక్షేత్రానికి చేరుకున్నారు. సాయంత్రం నిర్వహించిన పూజ కార్యక్రమంలో ఆసిఫాబాద్ ఎమ్మెల్యే కోవ లక్ష్మి పాల్గొన్నారు. వారితో కలిసి పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ఈ వెల ఆదివాసీ గిరిజనులకు ఎంతో పవిత్రమైందని పేర్కొన్నారు. తరతరాల నుంచి సంస్కృతి సంప్రదాయాలను కాపాడాలని కోరారు. ఖండేవు ఆలయ అభివృద్ధితో పాటు భక్తులకు అన్ని సౌకర్యాలు కల్పించడానికి తనవంతు సహాయసహకారాలు అందిస్తామని తెలిపారు. కార్యక్రమంలో తొడసం వంశానికి చెందిన కటోడ బాపురావు, తెలంగాణరావు, తొడసం నాగోరావు, సర్పంచ్ బానోత్ గజానంద్‌నాయక్, పీఏసీఎస్ డైరెక్టర్ కాంతారావు దుర్గే, మాజీ ఎంపీపీ మెస్రం రూప్‌దేవ్, బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు మెస్రం హన్మంతరావు, నాయకుడు సయ్యద్‌ఖాసీం తదితరులున్నారు.


ఖండేవుని సంప్రదాయ మహాపూజలో ఎమ్మెల్యే




ఆర్టీసీ బస్టాండ్‌లో అడ్డదిడ్డంగా పార్కింగ్

నిర్మల్ ఆర్టీసీ బస్టాండ్‌లో వాహనాలను అడ్డదిడ్డంగా పార్కింగ్ చేస్తున్నారు. కుటుంబ సభ్యులు, బంధువులను ద్విచక్రవాహనాలపై బస్టాండ్‌కు తీసుకువస్తున్నవారు నోపార్కింగ్ ప్లేస్‌లో బైక్‌లు పార్కింగ్ చేస్తున్నారు. దీంతో బస్సులు పాయింట్‌పైకి తీసుకురావడానికి డ్రైవర్లుఇబ్బంది పడుతున్నారు. ఆర్టీసీ అధికారులు ఎన్ని చర్యలు తీసుకున్నా ద్విచక్రవాహనదారులు, ఆటో వాలాల తీరు మారడం లేదు.
– సాక్షి ఫొటోగ్రాఫర్ నిర్మల్

